ప్రేమించినందుకు ఆత్మహత్య చేసుకున్న ఆమెను ఆ ఉత్తరం ఎలా రక్షించగలిగేది?

శారదా అశోకవర్ధన్ కథ

# నీలాగా ఎందరో!

పేపరు చదవడం పూర్తిచేసి, పేపర్ని నేలమీద గిరవాటేసింది భవ్య!

'వెధవ పేపరు! పేజీ తిరగేస్తే చాలు! చావులూ...చావులూ... ఎవరో చంపారనో! ఆత్మహత్య చేసుకున్నారనో! అన్నింటికంటే చవకై పోయింది, ఈ రోజుల్లో మనిషి ప్రాణం ఒక్కటే!

అయినా ఈ మొగవాళ్లకి ఇదేం రోగం? పెళ్లి చేసుకుంటావని మాటిచ్చి మోసం చెయ్యడం, లేకపోతే పెళ్లిచేసుకుని, కట్నాలు చాలవని కాల్చి చంపడమో, చచ్చిపోయేలా చెయ్యడమో!' భవ్య కుర్చీలోంచి లేచి రేడియో 'ఆన్' చేసింది, ఏదో పాటొస్తోంది. రేడియో కట్టేసింది. మనసు మనస్సులో లేదు. ఇలాంటి కబుర్లు చదివినా విన్నా నిర్మల జ్ఞాపకం వస్తుంది!

భవ్య కళ్లల్లో నీళ్లునిండి, దుఃఖం గొంతులో అడ్డుపడి మాటరాకుండా, ఊపిరాడకుండా చేసింది.

కోపం, బాధా వరవరాల్ని తెంచేస్తున్నట్టనిపించింది. ఏమీ చెయ్యలేని నిస్సహాయత భోరుమని, ఏడవాలనిపించింది. నీరసం వొచ్చినట్టయి వెళ్లి మంచంమీద పడుకుంది, కళ్లు మూసుకుని.

మనిషి జీవితంలో ఏవేవో చెయ్యాలనుకుంటాడు. జీవితాన్ని పూలపానుపులా ఊహించుకుని, కమ్మని కలలు కంటాడు. ఏ కొందరు అదృష్టవశాతులకో తప్ప ఆ కలలు నిజంకావు సరికదా ఏ ముళ్ళకంచెకో చిక్కుకుపోతుంది జీవితం. పరిస్థితులను తట్టుకోలేక, ఆశలు



బొగ్గయిపోతే, జీవితాన్ని అంతం చేసుకుంటాడు. సరిగ్గా నిర్మల విషయంలో అదే జరిగింది! మనసు బాధతో కొట్టుకుపోయింది! ఇన్నేళ్లు దాటినా, ఆ జ్ఞాపకాలు మనస్సులో నుంచి పోవడంలేదు! భవ్య మళ్లీ ఆలోచనల్లో మునిగిపోయింది.

భవ్యా, నిర్మలా క్లాస్‌మేట్స్. స్కూలులో ప్రారంభమయిన వారి

స్నేహం, కాలేజీలో డిగ్రీ పుచ్చుకున్నాక దారిమళ్ళింది. భవ్య ఎమ్.ఏలో చేరింది. నిర్మల పెళ్లి బేరాల సంతలో పశువులా మిగిలిపోయింది!

భవ్య, తల్లిదండ్రులకి గారాల బిడ్డ! గంగాధరరావుగారూ లలితాంబలకి మధ్య మొలచిన మొలక భవ్య ఒక్కతే! అందుకే ఆమె వారికి ఆరోప్రాణం, అంటే అతిశయోక్తికాదు. భవ్యని మగపిల్లాడిలా పెంచారు. సైకిలూ, స్కూటరూ, కారు డ్రైవ్ చేస్తుంది. 'కరాటే' నేర్చుకుంది. ఆ రోజుల్లో సికింద్రాబాదులోని మారేడుపల్లి నుంచి, హైదరాబాదులోని నిజాంకాలేజీ దాకా, స్కూటర్ మీద కాలేజీ కెళ్లే ఆడపిల్ల భవ్య ఒక్కర్తే.

నిర్మల కూడా సికింద్రాబాదులోని, సరోజినీదేవి రోడ్డులో వుండేది. భవ్య స్కూటర్ మీద వెనుక సీటులో కూర్చునొస్తే, నిర్మలా వాళ్ల అమ్మానాన్నా నిర్మలని కోప్పడేవారు. "ఏమిటా పిచ్చి వేషాలు? మగరాయుడిలాగా అది నడపడం, నువ్వు స్కూటరు వెనకాల కూర్చుని రావడం" తల్లి మంగమ్మగారు మందలించేవారు. తండ్రి రాఘవరావు గారు కన్నబిడ్డని కూడా కన్నెత్తి చూడడం, మహాపాపం అనుకునేరకం. తల్లికి వంత పాడేవారు. ఇద్దరికీ మహా చాదస్తం! నిప్పు కడిగేంత ఆచారం! పమిటచెంగు మెడచుట్టూ కప్పుకోకపోతే తప్పు, ఇంట్లో అయినాసరే, అలాగే వుండాలి, పెద్దగా నవ్వితే తప్పు! గట్టిగా మాట్లాడినా తప్పే!

నవీనభావాలతో ఆధునికంగా పెరిగే భవ్య కీ, సనాతన కుటుంబంలో, సంకుచితంగా పెరిగే నిర్మలకీ, స్నేహం ఎలా కుదిరిందా? అని అందరూ ఆశ్చర్యపోయేవారు. దానికి కారణం నిర్మలకి భవ్య అంటే ప్రాణం! ఆమె తెలివితేటలూ, అందం, అన్నింటినీ మించిన మంచి మనస్సూ, నిర్మలకి ఎంతో ఇష్టం!

నిర్మల అంటే భవ్యకి ఎంతో అభి[illegible] నిర్మలమైన మనస్సూ, కొట్టొచ్చినట్టు కనబడే తెలివితేటలూ నిరాడంబరతా, నిర్మల యొక్క స్వభావం భవ్యకి ఎంతో గౌరవం ఆమె అంటే!

అందుకేనేమో ఇద్దరికీ కుదిరింది ఆ స్నేహం! ఒకరిని విడిచి ఒకరు వుండరు! మనసులోని ప్రతీమాటా ఒకరితో ఒకరు పంచుకుంటారు. కొందరు వీరిని ఎగతాళిచేస్తూ కృష్ణుడూ — కుచేలుడూ అనేవారు. మరికొందరు 'రాజా—పేదా' అనేవారు. ఎవరేమన్నా పట్టించుకునేవారు కాదు ఇద్దరూ.

మగాళ్లు వున్న కాలేజీకి ససేమిరా పంపనన్నారు నిర్మల అమ్మా నాన్నా! అయితే ఆ ఒక్క కాలేజీకే అప్లై చేసి ఊరుకున్నారు భవ్యా, నిర్మలా! నిర్మలని మగాళ్లున్న ఆ కాలేజీలో చదవొద్దన్నారు. ఆడపిల్లల కాలేజీకి, అప్లై చెయ్యనందుకు నానా తిట్లూ తిట్టారు. ఆ సంవత్సరం చదువు పోయినాసరే, ఇంట్లో కూర్చోమన్నారు. కానీ వాళ్ల మామయ్య ఇచ్చిన సలహా, చాలా చక్కగా పనిచేసింది. "డిగ్రీ ఉంటే అమ్మాయికి, కట్నం లేకుండా పెళ్లయిపోతుందనీ, తన దృష్టిలో అటువం

టివి కొన్ని సంబంధాలున్నాయనీ'' అతను చెప్పడంవల్ల, విధిలేక తొంభై తొమ్మిది నిబంధనలతో, నిర్మలని కాలేజీకి పంపించారు.

ఈ విషయం భవ్య వాళ్ల అమ్మానాన్నలతో చెబితే, ఒకటే నవ్వుకున్నారు! "మగవాళ్లతో, ధైర్యంగా మాట్లాడడానికి జంకు, భయమూ దేనికమ్మా? అతనూ మనిషేగా! ఎదుటివాళ్ల ప్రవర్తనెప్పుడూ, మన ప్రవర్తనపైన ఆధారపడి వుంటుంది'' అనే వారు నాన్న!

"కొందరు మగాళ్ళతో మాట్లాడుతూ వుంటే, నేలచూపులు చూస్తు, పదే పదే పమిటకొంగు సవరించుకుంటూ, మెలికలు తిరిగిపోతూ వుంటారు. మరి కొందరు మగరాయుళ్ళలా, బొత్తిగా సిగ్గూ, మర్యాదా లేకుండా వెగటుగా ప్రవర్తిస్తారు! హాయిగా ఒక స్నేహితురాలితో మాట్లాడుతున్నట్టు మామూలుగా వుండొచ్చుగా! మనస్సు ప్రధానం దేనికైనా! కల్మషంలేని మనస్సుకి ఆంక్షలు దేనికి?'' అనేది అమ్మ!

'పెళ్లి' అనే మార్కెట్టులో బేరం తగిలినప్పుడల్లా 'షోరూంలో'ని బొమ్మలా తయారయ్యేది నిర్మల. బేరం కుదరకనో, పొట్టి, పొడుగూ అనో, నలుపూ, ఛాయ తక్కువనో, ఇలా ఏవో వంకలు పెట్టి వెళ్ళిపోయేవారు మగధీరుల తరుపువారు. నిర్మల తల్లిదండ్రి ఆడపిల్లని కన్నందుకు ఆరోజంతా తమని తాము నిందించుకునేవారు, అదేదో పెద్ద శాపమో, పాపమో అయినట్టు. ఆ మాటలు వినలేక, తనలో తాను బాధపడేది నిర్మల.

* * *

ఆ రోజు నిర్మల భవ్యని రమ్మని కబురుపెట్టింది. "ఏమై వుంటుందా? ఒకవేళ, పెళ్లి బేరం కుదిరిందేమో! అయితే ఆ కబుర్లు వినాల్సిందే!'' అనుకుంటూ స్కూటరేసుకుని వెళ్ళింది భవ్య. స్కూటర్ చప్పుడు విని పరుగెత్తుకొచ్చింది నిర్మల బయటికి.

"హల్లో భవ్య! ఫరవాలేదు తొందరగానే



### మీసం కేసు

కొందరికి మీసం పెంచడం సరదా! అలాటి సరదా కెనడాకు చెందిన 37సంవత్సరాల ఎడ్వర్డ్ మర్ఫీకు ఉంది. అతడు టోర్నాటోలో పోలీసుకానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. అయితే కెనడా ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం పోలీస్ శాఖలో పనిచేసేవారు చిన్న మీసాన్నే ఉంచుకోవాలి. మర్ఫీ తన మీసాన్ని విపరీతంగా పెంచుతూ పోవటంతో పోలీసు కమిషనర్ అతడికి 500 డాలర్ల జరిమానా విధించారు. ఈ విషయాన్ని సుప్రీంకోర్టు దృష్టికి తీసుకొని వెళ్ళాడు. మర్ఫీ అయినా ఉపయోగం లేకపోయింది. వెంటనే అతడి మీసాన్ని ప్రభుత్వ నిబంధన ప్రకారం కత్తిరించుకోమని తీర్పునిచ్చింది కోర్టు — పాపం మర్ఫీ!

—జూపిటర్

ఒచ్చావే! దేవిగారికి తీరికుందో లేదో ఎప్పుడొస్తుందో ఏమిటో?'' అనుకుంటు న్నాను! అంది నిర్మల.

''నిర్మలమ్మగారు రమ్మంటున్నారని'' వాచ్‌మన్ చెప్పేసరికి ''జీ...హోజూర్...ఆర్డర్స్'' అనుకుంటూ వొచ్చేశాము'' అంది భవ్య.

ఇద్దరూ నవ్వుకున్నారు.

''ఆ... ఇంట్లో ఎవ్వరూ లేరా? అమ్మగారు ఇంత పెద్దగా నవ్వుతున్నారు!'' అంది భవ్య.

''లేరు! అందరూ గుడికి వెళ్ళారు చిక్కడ్‌పల్లి వెంకటేశ్వరస్వామి దేవాలయానికి!''

''అంటే ఒక రెండు గంటలయినా పడుతుంది. గుడ్...చెప్పు... ఎందుకు అర్జంటుగా పిలిపించావ్''!

''అదికాదు! రా...లోపలికి..నీతో మాట్లాడాలి''. అంటూ లోపలికి దారి తీసింది నిర్మల.

''ఓ..అయితే ఏదో పెద్ద కథే వుందన్న మాట'' అంటూ వెనకాలే నడిచింది భవ్య. ''ఊ..చెప్పు'' అంటూ.

''భవ్యా! మనం కాలేజీలో వున్నప్పుడు, ఒక కుర్రాడు మనల్ని ఎప్పుడూ వెంబడించేవాడు జ్ఞాపకం వుందా?''

''ఊ...నీ ఫ్రెండేనా? నిమ్మీ...ఓ...నిమ్మీ...అంటూ పాటలు పాడేవాడు, అతడేనా?''

''ఊ...?అతడు మొన్న నేను మామయ్యా వాళ్లింటికి వెళుతూవుంటే, బస్టాండులోకలిశాడు. నేను చూసీ, చూడనట్టు ఊరుకున్నాను. దగ్గరికొచ్చి, గుడ్‌మార్నింగ్ అన్నాడు నవ్వుతూ. నేనూ గుడ్‌మార్నింగ్ అని చిన్నగా నవ్వాను!''

''ఓ!.. ఇంటరెస్టింగ్‌గా వుంది. తరవాత ఏమయింది?''ఆత్రుతగా అడిగింది భవ్య.

''మీరేమీ అనుకోకపోతే మీతో అయిదు నిమిషాలు మాట్లాడాలి!'' అన్నాడు.

''ఏం మాట్లాడాలి?'' అన్నాను భయంగా.

''ఒక ముఖ్యమైన విషయం''.

''ఇక్కడ రోడ్డుమీదా?''

''మరయితే అలా హోటల్‌కి వెళదామా? కాఫీ తాగుతూ మాట్లాడుకోవచ్చు'' భయంగానే అన్నాడు. అతనికేసి గుడ్లెర్రజేసి చూశాను.

ఆ చూపులకి తల వంచుకున్నాడు.

''పాపం! హోటల్ కెళ్ళి కాఫీ తాగినంత మాత్రాన ఏమవుతుందిట?'' కొంటెగా అంది భవ్య.

''మా వాళ్లెవరైనా చూస్తే, మమ్మల్ని పచ్చడి చేస్తారు'' అంది.

ఇద్దరూ నవ్వుకున్నారు.

''అయితే, నీకతడు వచ్చాడన్నమాట!''

''ఈ వీధిలోనే వుంటారుకద వాళ్ళు! అమ్మావాళ్లు కూడా తెలుసు మంచి ఫామిలీయే''

''సరే! అసలు సంగతి చెప్పు అతనేమన్నాడు? కరెక్టుగా అతనన్నమాటలే చెప్పు'' అంది భవ్య.

''అదే! నాకు మీరంటే ఇష్టం మరి, మీకు ఇష్టమయితే మావాళ్లు, మీ ఇంటికొచ్చి మిగతా విషయాలు మాట్లాడతారు''

అన్నాడు.

నేను సమాధానం చెప్పలేదు.

"వాట్...ఎ...ఫూల్...యూ...ఆర్!... నిజంగా నువ్వు వట్టి శుంఠవి" అంది భవ్య.

"నీ మొహం! అలా డైరెక్టుగా అతనడిగే సరికి, నాకు కంగారు పుట్టింది. మాట్లాడలేకపోయాను"

"ఊ!...చెప్పు! తరవాతేమయింది!"

"మౌనం అంగీకారమంటారుగా! ఓ...కే చెప్తా వినండి. ఇక్కడ నేను, మా అక్కయ్యా వాళ్ల ఇంట్లో వుంటున్నాను. రేపో, ఎల్లుండో మా అమ్మగారు, నాన్నగారూ ఒస్తున్నారు. ఇక్కడేవో రెండు మూడు సంబంధాలున్నాయంటే చూడ్డానికి! మీ గురించి కూడా చెబుతాను. మా అక్క మీ అమ్మగారిని కలుసుకుంటుం ట." అన్నాడు.

"నువ్వేమన్నావ్?"

"నేనేమీ అనలేదు అతనే చెప్పాడుకదా, మౌనం అంగీకారమని!"

"ఊ...!"

"మొన్న వాళ్ళ అక్కా బావా వొచ్చి, అమ్మా నాన్నలతో, వాళ్లమ్మగారొచ్చాక పెళ్ళిచూపులు కొస్తామని చెప్పి వెళ్లారు."


"ఒచ్చారా?

"ఊ... అందరూ వొచ్చారు కాఫీ, ఫలహారాలూ అయ్యాయి! వెళ్లారు! ఇంకావాళ్ల దగ్గర మంచి కబురు రాలేదు."

"కంగారు పడకు తల్లీ ఒస్తుంది."!

"భవ్యా! వీళ్లా కట్నాల దగ్గర బేరమాడేరే! అంటే ఈ కట్నాల బెడద లేకుండా పెళ్ళి జరగదా? అసలు డబ్బివ్వ కపోతే ఆడపిల్లకి పెళ్ళికాదా?"

"ఎంత చదువుకున్నా ఏం చేసినా ఆడపిల్లకి, పెళ్ళిదాకా ఒచ్చేసరికి ఇదో పెద్దసమస్యై కూర్చుంటోంది! అసలు నన్నడిగితే, ఆడపిల్లల దగ్గరి మంచి, తిరుగుబాటు రావాలంటాను. పెళ్ళి ఆడవాళ్లకొక్కరికే అవసరమా? మనలాగా చదువుకున్నవాళ్లు కూడా నోరు మూసుకుని



పడుండకూడదు" ఆవేశంగా అంది భవ్య.

నిర్మల మాట్లాడలేదు. ఏదో ఆలోచిస్తూవుంది.

"ఇంతకీ అమ్మాయిగారికి అతను నచ్చినట్టేనా?"

"ఏమిటా పిచ్చి ప్రశ్న, అంతా నీవి" కోపంగా అంది నిర్మల.

"అతనికీ నువ్వు నచ్చావు! ఇంక గొడవేముంది? పెళ్ళి ఖాయం! నీ పెళ్ళిలో గొడవంతా నాదేనే! అతన్నొక ఆట పట్టిస్తాను! తెగ ఏడిపిస్తాను! ఇదుగో నిమ్మీ... నువ్వు నన్ను కంట్రోలు చెయ్యకు! ఇప్పుడే చెప్తున్నాను" అంది చిలిపిగా, నిమ్మికేసి చూస్తూ.

నిమ్మి నవ్వింది. "ఉండు! లైమ్ జ్యూస్ చేసి తెస్తాను" అంటూ లోపలికెళ్ళింది. ఒక ప్లేటు నిండా, మురుకులూ, రెండు గ్లాసుల్లో 'జ్యూసు' చేసి తీసుకొచ్చింది. అవి తింటూ, అలా ఎంతసేపు కూర్చున్నారో తెలీదు. ఏవేవో కబుర్లు చెప్పుకున్నారు. కాలేజీ దగ్గిరనుంచి, స్కూలు దగ్గిర నుంచి, సినిమాల దాకా, అన్ని విషయాలూ, మాట్లాడుకున్నారు.

"ఇంక వెళ్తానే! వాళ్ల దగ్గర నుంచి వార్తరాగానే కబురు పెట్టు! ఒచ్చి వాల్తాను" అంటూ బయలుదేరింది. భవ్య!

* * *

భవ్యకి కాలేజీ గొడవల్లో తీరిక లేకుండావుంది. ఆరోజు బడలికగా సాయంత్రం ఇల్లు చేరుకుంది యూనివర్సిటీ నుంచి! పిడుగులాంటి వార్త భవ్యని పిచ్చిదాన్ని చేసింది!

"ఆ మధ్యాహ్నమే నిర్మల నల్లులమందు తాగేసిందట! ఆసుపత్రికి తీసికెళ్ళగానే, ఇంచుమించు ఆసుపత్రి చేరుకుంటుండగానే, ప్రాణంపోయిందట. బాడీని పోస్టుమార్టమ్‌కి తీసికెళ్లారుట. ఇంకాతేలేదు. ఈలోగా నువ్వు వచ్చేవేమో చూసి పోదామని వచ్చాను" అంది లలితాంబ కళ్లు తుడుచుకుంటూ.

భవ్యకి మతిపోయినట్టనిపించి! వెక్కి వెక్కి ఏడ్చింది పసిపిల్లలా లలితాంబగారి ఒడిలో తల పెట్టుకుని!

కాస్సేపటికి తేరుకుని "మమ్మీ! అసలెందుకు చచ్చిపోయిందట నిర్మల? చచ్చిపోయేంత ఘోరం ఏం జరిగింది?" అడిగింది.

"నిర్మలకి ఎన్నో సంబంధాలు ఒచ్చిపోతున్నాయి. ఒక్కటీ సెటిల్ కావడం లేదుకదా! మొన్నామధ్యన ఏదో సంబంధం ఒచ్చిందట. అదైనా కుదురుతుంది అనుకున్నారట. వాళ్ల దగ్గర నుంచి కూడా ఏదీ సమాధానం రాలేదుట. ఆ అబ్బాయి ఒకరోజున, నిర్మలకి ఎక్కడో కనబడి మాట్లాడటం, నిర్మల నాన్నగారు చూశారుట. దాంతో అలా రోడ్డుమీద సిగ్గులేకుండా పరాయి మొగాడితో మాట్లాడుతున్నావని కోప్పడ్డాట్ట! ఆ మాటలకి నిర్మల బాధపడుతూ, "తన పెళ్ళి గురించి బెంగపెట్టుకోనక్కరలేదని, పరువుపోయే పన్లు తనేమీ చెయ్యలేదని, తండ్రిపేర ఉత్తరం రాసిపెట్టి, నల్లుల

మందు తాగేసిందట. ఇంట్లోవాళ్ళు తెలుసుకుని రిక్షాలో ఆస్పత్రికి తీసుకెళ్ళేసరికి అక్కడే చనిపోయిందట" లలితాంబ కూడా దుఃఖాన్ని ఆపుకోలేక ఏడుస్తూనే చెప్తోంది.

"బిడ్డలకి రక్షణ నిచ్చేది ఇల్లే. వాళ్ళకు పరిస్థితులు బోధపడేలా నచ్చచెప్తే వాళ్ళబాగోగులు చూసుకుంటూ తల్లిదండ్రులు మెలగాలే తప్ప బిడ్డలు వారి మాటలనీ తల్లిదండ్రులతో చెప్పుకోడానికి భయపడే విధంగా ప్రవర్తిస్తే ఎట్లా? పిల్లలకి తల్లి తండ్రులమీద, గౌరవమూ, అభిమానమూ కలిగేలా మెలగాలి గానీ, వాళ్లని చూస్తే భయపడి వొణికిపోయేలా వుంటే ఎలా? క్రమ శిక్షణ పేరుతో కొందరు తల్లిదండ్రులు క్రూరంగా ప్రవర్తిస్తారు! బిడ్డల మీద వారికి ప్రేమ లేకకాదు. అయితే బిడ్డల మనస్తత్వాన్నీ, వాళ్ల సమస్యలనీ తెలుసుకునే శక్తిలేక! వారిముందర వారిని కన్నందుకు తమని తాము నిందించుకోవడం, లేదా పిల్లల్ని కసురుకోవడం చేస్తే, పిల్లల్లో విరక్తి భావం కలుగుతుంది." ఎవరూ వినకపోయినా, అక్కడ వినేవాళ్ళు ఎవరూ లేకపోయినా, చెప్పుకుపోతోంది, భవ్యని ఓదారుస్తూ! లలితాంబ.

వేడివేడి బోర్నవీటా కలిపి తెచ్చి భవ్యకి తాగించింది!

"అమ్మా! నిర్మలని చూసొస్తాను. ఈపాటికి ఇంటికి తెచ్చేసి ఉంటారు" అంది భవ్య.

"పద! నేను వస్తాను" అంది లలితాంబ!

"ఇంకా పేపట్లో నిర్మలని తీసుకొస్తారట" ఎవరో అంటున్నారు. లోపలగదిలో తల్లి నెత్తీనోరూ బాదుకుంటోంది! తండ్రి పిచ్చివాడిలా వాలుకుర్చీలో కూర్చునున్నాడు దిగాలుపడి!

ఒకతను ఎవరో సైకిలు మీద వచ్చాడు. ఇంటిముందు అంతమంది జనం, ఎందుకు గుమిగూడి ఉన్నారో అర్థంకాక, అందరి మొహాలూ చూశాడు.

భవ్యలేచి వెళ్లింది అతని దగ్గరికి "ఎవరు కావాలి"! అని అడిగింది.

"నిర్మలగారున్నారా?" అడిగాడతను బెరుకు బెరుకుగా!

షాక్ కొట్టినట్టయింది భవ్యకి! గుడ్లనిండా నీరు నిండుతూంటే! "ఏం కావాలి? ఆమె...ఆమె..

"ఈ ఉత్తరం ఆమెకిచ్చెయ్యండి" అని ఒక కవరు భవ్య చేతిలో పెట్టి వెళ్లిపోయాడతను. కవరు చింపారు.



జేబుదొంగ

"ఎలాగోలా తంటాలుపడి శిక్షపడకుండా తప్పించాను కదయ్యా. మళ్ళీ జేబుకొట్టావెందుకు?" అడిగాడు ఇన్స్పెక్టర్ జేబుదొంగ భద్రమూర్తిని.

"శిక్షపడకుండా చెయ్యడానికి మూడొందలు అడిగారు కదండీ మీరు. మరి అదెలా వస్తాదనుకున్నారు" విరాగ్గా అన్నాడు భద్రమూర్తి.

—సిరిపిల్లా రషీద్ శిక్షక్ (జంగంపల్లి)

ఉత్తరం చదువుతూ భోరుమని ఏడ్చారు.

అంతలో నిర్మల బాడీని ఇంటికి తీసుకు రావడంతో ఆ ఇల్లు ఘొల్లుమంది! రాఘవ రావుగారి చేతిలోని ఉత్తరం కింద పడిపోయింది. భవ్య తీసి చదివింది.

"నిమ్మీ! అమ్మానాన్నల దగ్గిర నుంచి ఇంకా సమాధానం ఎందుకురాలేదా అని, నేనూ కంగారు పడ్డాను. ఆరోజు అనుకోకుండా మనం బస్సుస్టాండు దగ్గర కలుసుకున్నాం కదా! మీ ఇంట్లో వాళ్ళు, నా సమాధానం కోసం ఎదురు చూస్తున్నారని చెప్పావు. ఆ రాత్రే మా వాళ్ళకి ఫోన్‌చేసి మాట్లాడాను. అమ్మా నాన్నా అనుకోకుండా, ఏదో ఊరెళ్లారట, అందుకని, సమాధానం రాయడం లేటయింది. మావాళ్లు కట్నం ఒద్దన్నారు! నా అభిప్రాయాన్ని గౌరవించారన్నమాట నిమ్మీ! ఈ విషయం మా నాన్నగారు, మీ నాన్నగారికి ఉత్తరం రాస్తున్నారు. వెంటనే ముహూర్తం కూడా పెట్టించెయ్యమని! నిమ్మీ! ఆ ఉత్తరం చూసి, మీ వాళ్లు ఎంత సంతోషిస్తారోకదూ! వారి బెంగ తీరిపోతుంది. నేను అదృష్టవంతుణ్ణి! ఉంటా! ఈ ఉత్తరం మీవాళ్లకి చూపించు! తప్పేముంది! ఎలాగూ ఇంక నువ్వు నాదానివేగా!

ఉంటా ని
మనువ్

వణుకుతూన్న చేతుల్లోంచి ఎగిరి ఉత్తరం నిర్మల మీద పడింది!

భవ్య కళ్లు కుండ పోతలయ్యాయి!

"ఒక్కపూట ఆ ఉత్తరం ముందొచ్చుంటే?" నిర్మల జీవితం ఇరవై ఏళ్ళకే పూర్తయ్యేది కాదు!!

"నిర్మల ఎందుకు చచ్చిపోయింది, పిచ్చిది!"

"కాదు..నిర్మల చచ్చిపోలేదు"

"చం..పే...శా..రు!"

"సంకుచిత మయిన స్వభావాలతో ప్రతి చిన్న విషయానికీ సమాజానికి భయపడుతూ బతికే పిరికి పందలు! చంపేశారు!"

"నిర్మలమైన మనస్సుని అర్థం చేసుకోలేక, నిందలు మోపే మూఢులు...చంపేశారు!"

"నా నిర్మల చచ్చిపోలేదు! నిమ్మీ..నిమ్మీ! నీపెళ్లిలో గోల చేస్తానని, ఏడిపిస్తానని చెప్పానే! కోపం వచ్చిందా! నన్నే ఏడిపించేసి వెళ్ళిపోయావ్?" భవ్య పిచ్చిదానిలా అరుస్తోంది.

లలితాంబ బలవంతంగా భవ్యని కారులో కూర్చోపెట్టి ఇంటికి తీసికెళ్లింది!!

* * *

"భవ్య ఎన్నో వ్యాసాలు రాసింది కట్నాల మీద!" కన్నవారికి పిల్లలు బరువుకాదు. కానీ, కట్నాల బెడద భరించలేక, ఆడపిల్లల్ని కన్నవారు, కృంగిపోతున్నారు. వారి బాధని చూడలేక, కన్నెపిల్లలు విలవిల లాడిపోతున్నారు! హాయిగా పెళ్లిచేసుకుని యువతీ యువకులు, కులాసాగా వుండవలసిన తరుణంలో, డబ్బుతో ముడిపెట్టి! పెళ్లంటే

ఆడపిల్లలు ఝుడుసుకునేలా చేస్తున్నారు! ఈ వ్యవస్థ మారాలి! అందుకు యువకులు ముందుకు రావాలి!" భవ్య ప్రతిచోటా ఈ మాటలు చెబుతూనే వుంది. నిర్మల కథ వినిపిస్తూనే వుంది. అయినా పేపరు తిరగేస్తే చాలు! ఇవే వార్తలు!

ఎంతమంది నిర్మలలు బలైపోతున్నారో ఈ వ్యవస్థకి! అయినా మార్పు రావడం లేదు! భవ్య తలపట్టుకు కూర్చుంది!

నిర్మల తనని చూసి నవ్వుతూన్నట్టుగా అనిపించింది. "నవ్వకు నిర్మలా నన్ను చూసి! నీలాగా ఎందరో వున్నారు. వారికి ధయిర్యం చెప్పాలి. ఆడపిల్లలను కన్నవారికి, తమ బిడ్డల భవిష్యత్తుకోసం బెంగపెట్టుకుపోయి, పనికిరాని ప్రతివాడికీ, సంతలో పశువులా తమ బిడ్డల్ని చూపిస్తూ బేరాలు చేసే పద్ధతిని రద్దు చేయమని చెప్పాలి! మగపిల్లాడితోపాటు, ఆడపిల్లనీ చదివించినప్పుడు, ఆమెనీ గౌరవించి, ఆమె అభిప్రాయాలనూ స్వీకరించి, ఆదరించాలే తప్ప, కన్నవారే తమని తాము నిందించుకుంటూ, తమ అదృష్టాన్నీ దురదృష్టాన్నీ తరాజులో తూచుకుంటూ వుంటే ఆడపిల్లలకి బాధనిపిస్తుంది! ప్రతీ ఇంట్లో ఒక తల్లీ, చెల్లీ వుంటారుకదా! వారిలాగే అందరూ, అనుకుంటే! అసలు ఆడవాళ్లని మార్చాలి. కట్నం ఇవ్వమూ, పుచ్చుకోమూ అనే మాట వారి దగ్గిరి నుంచి రావాలి! అందుకే నా తపస్సు! నాకు తెలుసు అప్పుడే నీ మనస్సుకి శాంతి!! నన్ను ఆశీర్వదించు! నిమ్మీ!" అంటూ కుర్చీలో కూలబడిపోయింది భవ్య.

## కుక్కల ఫ్రాన్స్



ఫ్రాన్సులో కుక్కలూ, పిల్లులూ విపరీతంగా ఉన్నాయని ఆ దేశానికి చెందిన ఓ వారపత్రిక పేర్కొంది. పిల్లుల సంగతి సరిగ్గా తెలియదుకానీ... 51 మిలియన్ల జనాభా కల్గిన ఫ్రాన్స్లో తొమ్మిది మిలియన్ల కుక్కలు మాత్రం ఉన్నట్లు ఆ పత్రికలో ప్రచురించారు. ఈ కుక్కల మీద ప్రజలు కనీసం సంవత్సరానికి పది మిలియన్ ఫ్రాంక్ల ధనాన్ని ఖర్చుపెడ్తున్నారట. అయితే ఈ కుక్కలు అందుకు ప్రతిఫలంగా ప్రజలకు చేస్తున్న సేవ ఏమిటంటారా? ప్రతిరోజూ మొరగటం కనీసం అయిదు లక్షలమందిని కరుస్తూ... వ్యాధులపాలు చేయటమూ? కుక్కల సంఖ్యవల్ల ఫ్రాన్స్ప్రభుత్వం కూడా ఆందోళన చెందుతూ... వాటిని తగ్గించాలని ప్రయత్నిస్తోందట.

జూపిటర్